నమస్తే తెలంగాణ
జనగామ
10 | వరంగల్, శనివారం 5 ఏప్రిల్ 2025 | JANAGAON

మహాసభ పనులు ముమ్మరం

పనులు పర్యవేక్షిస్తున్న బీఆర్ఎస్ బృందం

- పది డోజర్లు, 5 ఎక్స్‌కవేటర్లతో భూమి చదును
- పర్యవేక్షిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హనుమకొండ సబర్బన్, ఏప్రిల్ 4 : బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ పనులు ముమ్మరం చేశారు. అంకురార్పణ జరిగిన తెల్లారి నుంచే పది డోజర్లు, ఐదు ఎక్స్‌కవేటర్ల సహాయంతో భూమి చదును చేసే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. సభా స్థలితో పాటు పార్కింగ్ స్థలాల్లో ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. శుక్రవారం నుంచి సభా పనులు ఊందుకున్నాయి. ఉదయాన్నే ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు సతీశ్ కుమార్, సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి బాలమల్లు, వికలాంగుల సంస్థ మాజీ చైర్మన్ వాసుదేవారెడ్డి, నిమ్మగడ్డ వెంకన్న,రాఘవ పనులను పర్యవేక్షించారు. ఇదిలా ఉండగా రజతోత్సవ వేడుకలు నిర్వహించే స్థలం నిర్ధారణ కావడంతో అనేక మంది సందర్శించి వెళ్తున్నారు.

అక్రమ అరెస్టులు నీ పతనానికి నాంది

- ఘన్‌పూర్ ఉప ఎన్నిక కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు
- కడియంపై కేసు నమోదు చేయాలి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

హనుమకొండ సబర్బన్, ఏప్రిల్ 4 : అక్రమ అరెస్టులు కడియం పతనానికి నాంది అని, నీతిమాలిన పనులు చేసిన నీ ఉప ఎన్నిక కోసం ఘన్‌పూర్ నియోజకవర్గ ప్రజలు ఎదురు చూస్తున్నారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. వేలేరు మండలంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా కడియం శ్రీహరి తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో శుక్రవారం రాత్రి పల్లా ప్రకటన విడుదల చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సోడషపల్లి గ్రామస్తులను కడియం అక్రమంగా అరెస్టు చేయించారని అన్నారు. నీ అధికార మదం ఎప్పటికీ శాశ్వతం కాదని పేర్కొన్నారు. ఏ పదవులు లేకుండా ఉన్న నిన్ను గులాబీ జెండా అక్కున చేర్చుకుని ఎమ్మెల్సీగా, మంత్రిగా, ఎంపీగా, ఎమ్మెల్యేగా చేసిందని గుర్తు చేశారు. చివరికి నీ బిడ్డకు కూడా టికెట్ తీసుకుని ఊసరవెల్లి సిగ్గుపడేలా తల్లి పాలు తాగి రొమ్ముగుద్దేలా వ్యవహరించావని ఎద్దేవా చేశారు. నువ్వు స్టేషన్‌ఘన్‌పూర్‌కు పట్టిన చీడపీడలాంటి వాడివని విమర్శించారు. తనను అనవసరంగా దుర్భాషలాడిన కడియం శ్రీహరిపై కేసు నమోదు చేయాలని పల్లా డిమాండ్ చేశారు. కాగా, పల్లాపై కడియం వ్యాఖ్యలకు నిరసనగా సోడషపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి దిష్టిబొమ్మను దహనం చేశారు.

సోడషపల్లిలో కడియం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

డోర్నకల్ నుంచి 20 వేల మంది..

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు డోర్నకల్ నియోజకవర్గం నుంచి సుమారుగా 20 వేల మంది తరలిరావాలి. గ్రామ పార్టీ అధ్యక్షులు ఆ రోజున ఉదయం బీఆర్ఎస్ జెండాను ఎగురవేసిన అనంతరం సభకు బయలుదేరాలి. నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలో ప్రతి గ్రామం నుంచి భారీగా కార్యకర్తలను తీసుకురావాలి.
–రెడ్యానాయక్, మాజీ ఎమ్మెల్యే

- కాంగ్రెస్ పార్టీ ఇస్తామన్న పథకాలు ఎటుపోయాయ్?
- ఆ పార్టీపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత
- స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నరు
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్

పెద్ద ఎత్తున తరలిరావాలి

ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు డోర్నకల్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున జనం తరలివచ్చి సంపూర్ణ మద్దతు తెలపాలి. నియోజకవర్గానికి ఇచ్చిన టార్గెట్ కనుగుణంగా గ్రామగ్రామాన ప్రణాళిక రూపొందించుకొని ముందస్తుగా సభకు చేరుకోవాలి.
– కవిత, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు

మహబూబాబాద్: రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న కవిత, పక్కన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే, నాయకులు

సభను సక్సెస్ చేద్దాం

మహబూబాబాద్, ఏప్రిల్ 4 (నమస్తే తెలంగాణ) : ఈ నెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభను సక్సెస్ చేద్దామని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మహబూబాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కవిత నివాసంలో డోర్నకల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం మాజీ మంత్రి రెడ్యానాయక్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మీద ఇంత త్వరగా ఊహించలేనంత వ్యతిరేకత వస్తుందని అనుకోలేదన్నారు. రేవంత్‌రెడ్డి మహిళలకు ఇస్తామన్న రూ. 2500, రైతు బంధు రూ. 15,000, ఆడబిడ్డ పెళ్లికి తులం బంగారం, తదితర పథకాలు ఇప్పుడు ఎటుపోయాయ్ అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా రేవంత్ రెడ్డి తీరులో మార్పు రాకపోవడం శోచనీయమన్నారు. తానంచర్లలో స్థానిక ఎమ్మెల్యేను రైతుబంధు రాలేదని ఓ రైతు అడిగితే మా దగ్గర పైసల్ లేవని చెప్పి చేతులు దులుపుకోవడం సిగ్గు చేటన్నారు. ఒక్క చెరువులో కూడా నీళ్లు నింపే ప్రయత్నం చేయలేని స్థితిలో రాష్ట్రప్రభుత్వం ఉందని, ఎండుతున్న పొలాలు చూస్తుంటే ప్రాణం తరుక్కుపోతుందన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తుందని, ప్రజలకు అండగా కేసీఆర్ ఉన్నారని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావు, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, యువ నాయకులు డీఎస్ రవిచంద్ర, నూకల వెంకటేశ్వర రెడ్డి, భిక్షంరెడ్డి, దేవేందర్, విద్యాసాగర్, వేణు, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు, పార్టీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్కతుర్తి సభ చరిత్రలో నిలిచిపోవాలి -మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్

ఎల్కతుర్తి, ఏప్రిల్ 4: బీఆర్ఎస్ పార్టీ 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోయేలా విజయవంతం చేయాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఎల్కతుర్తిలో పార్టీ మండల నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సభను ఎల్కతుర్తిలో నిర్వహించాలని కేసీఆర్ నిర్ణయించడం మనందరి అదృష్టమన్నారు. మనకు దక్కిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సభ విజయవంతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి మెజార్టీ ప్రజలు తరలివచ్చేలా చూడాలని చెప్పారు. యువత ముందుకొచ్చి వలంటీర్లుగా పనిచేసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పార్టీ నాయకులు, కార్యకర్తలకు సేవలందించాలని విజ్ఞప్తి చేశారు. సభ కోసం వచ్చే వాహనాల పార్కింగ్ కోసం స్థలాలు గుర్తించినట్లు ఆయన తెలిపారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ రాష్ట్రాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఇప్పుడు 25 వసంతాలు పూర్తి చేసుకున్నామని, భారీ బహిరంగ సభలకు పెట్టింది పేరు బీఆర్ఎస్ అని చెప్పారు. అంతకు ముందు సభా ప్రాంగణంలో జరుగుతున్న పనులను ఆయన ద్విచక్ర వాహనంపై వెళ్లి పరిశీలించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్, సొసైటీ చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, నాయకులు తంగెడ మహేందర్, ఎల్తూరి స్వామి, గొల్లె మహేందర్, తంగెడ నగేశ్, కడారి రాజు, పోరెడ్డి రవీందర్‌రెడ్డి, గొడిశాల వినయ్, కొమ్మిడి మహిపాల్‌రెడ్డి, దేవేందర్‌రావు, ఏ రాజు, వెంకటేశ్ యాదవ్, సాంబమూర్తి, సీ నగేశ్, దుగ్యాని సమ్మయ్య, వేముల శ్రీనివాస్, గుండేటి సతీశ్, జూపాక జడ్సన్, ఈర కమలాకర్, చెవుల కొమురయ్య, ఎస్ శంకర్, యాళ్ల మోహన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కే నవీన్, మదార్, విక్రంగౌడ్, శ్రీకాంత్‌యాదవ్, చిట్టిగౌడ్, కే ప్రవీణ్, ఉట్కూరి కార్తీక్, భగవాన్, రంజిత్, కృష్ణవేణి, భాగ్య పాల్గొన్నారు.

ధర్మసాగర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

స్వచ్ఛందంగా తరలిరావాలి – మాజీ ఎమ్మెల్యే రాజయ్య

ధర్మసాగర్, ఏప్రిల్ 4 : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభకు పదివేల మంది కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలిరావాలని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే టీ రాజయ్య పిలుపునిచ్చారు. ధర్మసాగర్, వేలేరు మండల కేంద్రాల్లో వేర్వేరుగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడారు. మనకు దగ్గరలోనే ఈ సభ జరుగనుందని, అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. దేశమంతా వ్యతిరేకిస్తున్న హెచ్‌సీయూ భూముల విషయాన్ని ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమర్థించడానికి సిగ్గు ఉండాలన్నారు. అక్రమంగా చెట్లను నరికి వేయడం వల్ల వన్యప్రాణులన్నీ రోడ్ల మీదకు వస్తున్నాయని అన్నారు. వాటిని చూస్తే హృదయం చలించిపోతున్నదని అన్నారు. అమలు కానీ హామీలు ఇచ్చి ప్రజాపాలన అంటూ గొప్పలు చెప్పు కుంటున్నారే తప్ప పనితనంలో చూపించలేకపోతున్నారని అన్నారు. దేవాదుల 3వ దశ పైపులైన్ మోటర్ల నిర్వహణకు రూ. 6 కోట్లు తెప్పించలేకపోవడాన్ని విమర్శించారు. ఆగమేఘాల మీద వచ్చి తమకే పేరు దక్కాలని మోటర్లు ఆన్‌చేసేందుకు వస్తే అవి సహకరించలేదని అన్నారు. మండల ఇన్‌చార్జులు కర్ర సోమిరెడ్డి, భూపతి రాజు, మాజీ జడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ మామిడి రవీందర్ యాదవ్, నాయకులు బొడ్డు ప్రభుదాస్, మల్కిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, లక్క శ్రీనివాస్, మారబోయిన రాజు, మహేందర్, హరీశ్, రమేశ్, మధు, ప్రవీణ్, రమణాకర్, విప్లవ్, కిట్టు, లక్ష్మి, రవిచందర్ పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడొద్దు

- ములుగు జిల్లాలో పోలీస్ రాజ్యం
- బీఆర్ఎస్ సభకు వేలాదిగా తరలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

ములుగు, ఏప్రిల్4(నమస్తేతెలంగాణ) : ములుగు జిల్లాలో మంత్రి సీతక్క కనుసన్నల్లో పోలీస్ రాజ్యం నడుస్తున్నదని, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై నమోదవుతున్న అక్రమ కేసులకు భయపడొద్దని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అధ్యక్షతన బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ముఖ్య నాయకుల సన్నాహక సమావేశం నిర్వహించగా, పెద్ది ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క కాంగ్రెస్ నాయకుడిపై అక్రమ కేసులు పెట్టించిందిలేదని అన్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పులను ఎత్తిచూపినా కార్యకర్తలపై కేసులు నమోదు చేయించి వేధింపులకు గురిచేస్తున్నారని అన్నారు. ఈ విషయంలో ఎవరూ అధైర్య పడొద్దని, నాయకత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలో రుణమాఫీ జరగలేదని, రైతు భరోసా ఇవ్వలేదని, బోనస్‌లు అందలేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో, ప్రభుత్వాన్ని నడపడంలో విఫలమైందని అన్నారు. కేసీఆర్ పాలనను ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని అన్నారు. కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఎగురవేసేందుకు కృషి చేయాలని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఈ నెల 27న ఎల్క తుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ మహా సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా నుంచి సభకు 15 వేల మంది తరలిరావాలన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి మాట్లాడుతూ ఉద్యమ నాయకుడు నిర్వహించే రజతోత్సవ సభకు ములుగు జిల్లా నుంచి వేలాదిగా కార్యకర్తలు తరలిరావాలన్నారు. జిల్లా అధ్యక్షుడు కాకులమ ర్రి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, ఏ సమస్య వచ్చినా తాను ముందుంటానని అన్నారు. సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, మాజీ ఎంపీపీలు గండ్రకోట శ్రీదేవీసుధీర్‌యాదవ్, సూడి శ్రీనివాస్‌రెడ్డి, వాణి శ్రీ, మాజీ జడ్పీటీసీలు తుమ్మల హరిబాబు, గై రుద్రమదేవి, పార్టీ పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, ములుగు, మల్లంపల్లి, వెంకటాపూర్ మండలాల అధ్యక్షులు సానికొమ్ము రమేశ్‌రెడ్డి, పాలెపు శ్రీనివాస్, రమణారెడ్డి, నాయకులు బేతెల్లి గోపాల్‌రెడ్డి, పోమానాయక్, ప్రదీప్‌రావు, మల్క రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌రామ్‌నాయక్, భూక్యా జంపన్న, సునీల్‌కుమార్, వినయ్‌కుమార్, వేములపల్లి భిక్షపతి, వేల్పూరి సత్యనారాయణరావు, మాచర్ల ప్రభాకర్, మోహన్, గొర్రె సమ్మయ్య, మధుసూదన్‌రెడ్డి, తండా రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ములుగులో మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న దాస్యం వినయ్‌భాస్కర్

అభివృద్ధి పేరుతో విధ్వంసం చేయొద్దు

హెచ్‌సీయూ భూములపై చర్చలో పర్యావరణవేత్తలు

హనుమకొండ, ఏప్రిల్ 4 : అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని నాశనం చేయొద్దని పలువురు పర్యావరణ వేత్తలు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం గత వారం రోజుల నుంచి హెచ్‌సీయూలో హైదరాబాద్‌కు ఊపిరి అందిస్తున్న అడవిని, వన్యప్రాణులను, వృక్షాలను, నీటి కుంటలను రాత్రికి రాత్రి ధ్వంసం చేయడం దారుణమని మండిపడ్డారు. ఈమేరకు 400 ఎకరాల అడవి విధ్వంసంపై ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ హాజరై మాట్లాడారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలున్న హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో చట్టాలను తుంగలో తొక్కి కోర్టు ఆదేశాలను సైతం ఉల్లంఘిస్తూ అక్కడి జీవవైవిధ్యాన్ని నాశనం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై చట్టప్రకారంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే భూముల కోసం పోరాటం చేస్తున్న విద్యార్థులపై, ఇతరులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు. తాను పర్యావరణ పరిరక్షణ కోసం కట్టుబడి ఉన్నానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులతో కుమ్మక్కై ఎన్నో ఏళ్ల నాటి చెట్లతో పాటు వన్యప్రాణులు, పక్షుల మనుగడ ప్రశ్నార్థకం చేయడం అత్యంత దారుణమని పర్యావరణవేత్త పిట్టల రవిబాబు ఆగ్రహం వ్యక్తంచేశారు. పర్యావరణవేత్త రతన్‌సింగ్ మాట్లాడుతూ సహజ వనరుల సంపద నశిస్తే భవిష్యత్ తరాలకు పరిస్థితి ఏమిటని ఊపిరితిత్తులు దెబ్బతింటే శరీరానికి ఎలా నష్టం కలుగుతుందో అలాగే అడవులు నాశనమైతే వాతావరణ మార్పులు, వాయు కాలుష్యం, నీటి కొరత వంటి సమస్యలు ఏర్పడతాయని చెప్పారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పౌర సమాజం పోరాడాలని మాజీ మేయర్ రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. సమావేశంలో పర్యావరణవేత్త నిఖిత, అరవింద్ ఆర్య, పరికిపండ్ల వేణు, శ్యామ్, కమలాకర్ స్వామి, విద్యార్థి నాయకులు శరత్, రాకేశ్ యాదవ్, బైరపాక ప్రశాంత్, శ్రీకాంత్‌చారి, వీరస్వామి, అనిల్ పాల్గొన్నారు.

కొత్తగూడ: దెబ్బతిన్న మక్కజొన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

బయ్యారం: సంగ్యాతండా శివారులో నీటి మునిగిన మక్కజొన్న

నెక్కొండ వ్యవసాయ మార్కెట్‌లో తడుస్తున్న మక్కజొన్నలు

నిండా ముంచిన వాన

వర్ధన్నపేట: పొలంలో రాలిన ధాన్యం

- గాలివానతో నేలవాలిన వరి.. రాలిన మామిడి
- చేతికొచ్చిన మక్కజొన్న, మిర్చి పంట నీళ్లపాలు
- ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలంటున్న రైతు సంఘాలు

నమస్తే నెట్ వర్క్, ఏప్రిల్ 4 : అకాల వర్షంతో రైతన్న ఆగమాగమవుతున్నాడు. గురువారం రాత్రి, శుక్రవారం ఈదురు గాలులతో కురిసిన వానకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పంటలు దెబ్బతిన్నాయి. వరి పంట నేలవాలగా, మామిడి కాయలు రాలిపోయాయి. చేతికొచ్చిన మక్కజొన్న, మిర్చి పంట నీళ్లపాలయ్యింది. బయ్యారం మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో కల్లాల్లో ఆరబోసిన మక్కజొన్న తడిసింది. మిర్చిపై టార్పాలిన్ కప్పినా ఫలితం లేకుండా పోయింది. సంగ్యాతండాలో మిర్చి, మక్క పూర్తిగా నీట మునిగింది. కొత్తగూడ, గంగారం, నర్సింహులపేట, వర్ధన్నపేట, గోవిందరావుపేట మండలాల్లో వరి, మక్కజొన్న పంట నేలవాలింది. ధాన్యం గింజలు సైతం రాలిపోయాయి. నెక్కొండ వ్యవసాయ మార్కెట్‌లో ఆరబోసిన మక్కజొన్నలు తడిసి ముద్దయ్యాయి. ఆయా గ్రామాల్లో తడిసిన పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. రైతులకు సలహాలు, సూచనలు అందించారు. అదేవిధంగా వెంకటాపురం (నూగూరు) నుంచి భద్రాచలానికి వెళ్లే రోడ్డు మార్గంలో రాళ్లవాగు వద్ద ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆర్టీసీ బస్సులను మణుగూరు, ఏటూరునాగారం మీదుగా మండల కేంద్రానికి తరలించారు. ఇతర వాహనాలు వాగుదాటి వెళ్లేందుకు వీలు లేక ఇబ్బందులు పడ్డారు. కాగా, నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

బయ్యారం మండలం సంగ్యాతండాలో మిర్చిలో చేరిన నీటిని తొలగిస్తున్న మహిళా రైతు

హాల్‌మార్క్.. అంతా తూచ్!

- ఇష్టారాజ్యంగా సెంటర్ల నిర్వహణ
- బంగారం కాని వస్తువులకు సైతం 916 కేడీఎం ముద్రలు
- పోలీస్ కేసుతో బయటపడిన నకిలీ ముద్రల బాగోతం
- వినియోగదారుల నమ్మకాన్ని వమ్ము చేస్తున్న హాల్‌మార్క్ సెంటర్లు
- వరంగల్ గోల్డ్ మార్కెట్‌లో హాట్‌టాపిక్‌గా వ్యవహారం

వరంగల్ చౌరస్తా, ఏప్రిల్ 4 : భారతదేశంలో బంగారానికి విలువ ఎక్కువ. ఆపదకాలంలో క్షణాల్లో అమ్మి సొమ్ము చేసుకొనే వెసులుబాటు ఉండడంతో పేద, మధ్య తరగతి దీనిని రిజర్వ్ నిధిగా భావించి కొనుగోలు చేస్తారు. అంతటి నమ్మకం, భరోసానిచ్చే పసిడి నాణ్యతను పరీక్షించేందుకు ప్రత్యేకంగా హాల్‌మార్క్ సెంటర్లు వెలిశాయి. ఇక్కడ బంగారం నాణ్యతా ప్రమాణాలను పరీక్షించి, ముద్రలు వేస్తాయి. అయితే, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) పర్యవేక్షణలో నిర్వహించే హాల్‌మార్క్ సెంటర్లు పచ్చిమోసాలకు అడ్డాలుగా మారాయి. నకిలీ ముద్రలు వేసి నాణ్యతా ప్రమాణాలు లేని బంగారానికి, అసలు బంగారమే కానీ లోహాలకు 916 కేడీఎం(22 క్యారెట్) బంగారంగా నకిలీ ముద్రలు వేసి వినియోగదారులను దోపిడీ చేస్తున్నాయి. నిబంధనలు తుంగలో తొక్కి ధనార్జనే ధ్యేయంగా సాగుతున్న ఈ సెంటర్లపై నిఘా, నియంత్రణ లేకపోవడంతో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల గ్రేటర్ వరంగల్ పరిధిలోని ఓ బ్యాంకులో కుదువ పెట్టిన బంగారాన్ని పరిశీలించిన అధికారులు అది నకిలీదిగా గుర్తించి పోలీసులను ఆశ్రయించడంతో విఘ్నేశ్వరుడి సాక్షిగా నకిలీ హాల్‌మార్క్ ముద్రల వ్యవహారం బయటపడింది. తప్పుడు ముద్రలు వేస్తూ అటు వ్యాపారులను ఇటు వినియోగదారులను మోసం చేస్తూ అక్రమార్జనను కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం బంగారం ధర ఆకాశాన్నంటడంతో కొందరు హాల్‌మార్క్ సెంటర్ నిర్వాహకుల కన్ను బ్యాంకులపై పడింది. 18 క్యారెట్, 16 క్యారెట్ నాణ్యతతో ఆభరణాలను తయారు చేయించి, 22 క్యారెట్ బంగారు ఆభరణాలుగా నకిలీ హాల్‌మార్క్ ముద్రలు వేయించి, బ్యాంకులు, వినియోగదారులను మోసం చేస్తున్నారు. తక్కువ నాణ్యతతో తయారు చేసిన ఆభరణాలను ఎక్కువ నాణ్యతతో తయారు చేయించినట్లు నకిలీ హాల్‌మార్క్ ముద్రలు వేయించి బ్యాంకులు, ప్రైవేట్ లోన్ సంస్థల్లో పెట్టి మోసం చేస్తున్నారు. ఇటీవల ఓ బ్యాంకులో అధికారులు తనిఖీ చేస్తున్న క్రమంలో బంగారం నాణ్యతా ప్రమాణాలు పరిశీలించి అసలు బంగారమే కానీ ఆభరణాలకు నకిలీ హాల్‌మార్క్ ముద్రలు వేసి భారీగా లోన్ తీసుకున్నట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. నకిలీదిగా గుర్తించిన బంగారం కొంతేనని, హాల్‌మార్క్ ముద్రలు చూసి నాణ్యత లెక్కలు వేసే రోజులు పోయాయని కొందరు బ్యాంకు ఉద్యోగులు వాపోతున్నారు. ఈ కేసులో వరంగల్ నగరంలోని హాల్‌మార్క్ సెంటర్ నిర్వాహకుడి హస్తం ఉన్నట్లు విషయం బయటకుపొక్కడంతో స్థానిక వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నకిలీ హాల్‌మార్క్ ముద్రలతో హాల్‌మార్క్ సెంటర్ నిర్వాహకుడు చాలా బ్యాంకుల్లో భారీ స్థాయిలో లోన్ తీసుకున్నట్లు వ్యాపార వర్గాల్లో చర్చలు సాగుతున్నాయి. రానున్న రోజుల్లో బంగారం ధర తగ్గినట్లయితే ఈ నకిలీ హాల్‌మార్క్ ముద్రల వ్యవహారం మార్కెట్‌ను కుదేలు చేసే స్థాయిలో ఉండవచ్చునని కొందరు వ్యాపారులు భావిస్తున్నారు.

హాల్‌మార్క్ ముద్ర

ఆభరణానికి వేసే ముద్రలు